క్లుప్తంగా

మహిళలు రాజకీయాల్లో రాణించాలి

బెజ్జంకి(సిద్దిపేట): మహిళలు అన్ని రంగాల్లో ఉన్నతంగా ఎదుగుతున్న విధంగానే రాజకీయాల్లోనూ రాణించాలని బీజేపీ మహిళా మోర్చా మండల అధ్యక్షురాలు బామండ్ల జ్యోతి అన్నారు. మండలంలోని గాగిల్లాపూర్‌లో పలువురు మహిళలను ఆదివారం సన్మానించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ ఇటీవల జరిగిన పార్లమెంట్, అసెంబ్లీ ఎన్నికలలో తమ వెన్నంటివుండి పార్టీ అభ్యర్థుల విజయం కోసం కృషి చేశారన్నారు. మహిళలు వచ్చే స్థానిక ఎన్నికల కోసం సమాయాత్తం కావాలని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో బీజేవైఎం మండల అధ్యక్షుడు తూముల రమేష్, అజిత్‌రెడ్డి, శ్రీకాంత్, శ్రీనివాస్, నరేష్, అనిల్ తదితరులు పాల్గొన్నారు.

ఘనంగా హనుమాన్ హోమం



పొట్లపల్లిలో పంచముఖ హనుమాన్ హోమం నిర్వహిస్తున్న భక్తులు

బెజ్జంకి(సిద్దిపేట): మండలంలోని గాగిల్లాపూర్ హనుమాన్ దేవాలయంలో స్వామి దీక్ష చేపట్టిన భక్తులు ఆదివారం పంచముఖ హనుమాన్ హోమం నిర్వహించారు. ఈ సందర్భంగా కలశస్థాపన, నవగ్రహ పూజ, స్వామివారికి పంచామృతాభిషేకం, క్షీరాభిషేకం చేశారు. అనంతరం హనుమాన్ మహాయజ్ఞం, పూర్ణాహుతి నిర్వహించారు. కార్యక్రమంలో ఎంపీటీసీ మల్లేశం, ఆలయ పూజారి వెంకటేశం, శ్రీకాంత్, శ్రీనివాస్‌రెడ్డి, స్వామి తదితరులు పాల్గొన్నారు.

పొట్లపల్లిలో..

హుస్నాబాద్‌రూరల్: హుస్నాబాద్ మండలం పొట్లపల్లి హనుమాన్ దేవాలయంలో ఆదివారం స్వామి దీక్ష చేపట్టిన హనుమాన్ భక్తులు హోమం నిర్వహించారు. రోహిణీ కార్తెలో వర్షాలు సమృద్ధిగా కురిసి పంటలు బాగా పండాలని స్వామి వారిని వేడుకున్నారు.

నిరుపయోగంగా వైకుంఠధామం



మెట్‌పల్లిలో నిర్మించిన వైకుంఠధామం

చిన్నకోడూరు(సిద్దిపేట): చనిపోయినవారి అంతిమ సంస్కారం గౌరవంగా జరగాలని ప్రభుత్వం లక్షలు వెచ్చించి ప్రతీ గ్రామ శివారులో అన్ని వసతులతో వైకుంఠధామాలు నిర్మించింది. మండల పరిధిలోని మెట్‌పల్లిలో వైకుంఠధామం నిర్మించి మూడేళ్లవుతున్నా ప్రారంభానికి నోచుకోలేదు. వైకుంఠధామానికి నీటి వసతి, విద్యుత్ సౌకర్యం కల్పించలేదు. ప్రస్తుతం అంత్యక్రియలు నిర్వహించే పరిస్థితి లేదు. దీంతో అయినవారిని కోల్పోయిన వారు తమ సొంత భూముల్లో అంత్యక్రియలు నిర్వహిస్తున్నారు. నిరుపయోగంగా ఉన్న వైకుంఠధామాన్ని అందుబాటులోకి తేవాల్సిన అధికారులు, ప్రజాప్రతినిధులు పట్టించుకోవడం లేదనే ఆరోపణలు వెల్లువెత్తుతున్నాయి. అధికారులు స్పందించి తగిన చర్యలు తీసుకోవాలని గ్రామస్తులు కోరుతున్నారు.

నాగభూషణంకు నివాళి



నాగభూషణం సంస్మరణ సభ

హుస్నాబాద్: హుస్నాబాద్ పట్టణంలో మూడు దశాబ్దాల క్రితం పార్థసారథి గీతా మందిరం నిర్మాణానికి భూమిని దానం చేసిన గాండ్ల నాగభూషణం కారణజన్ముడని వక్తలు కొనియాడారు. ఇటీవల ఆయన మృతి చెందాడు. ఆదివారం పార్థసారథి గీతా మందిరంలో నాగభూషణం సంస్మరణ సభ నిర్వహించారు. ఆయన చిత్రపటానికి పూల మాలలు వేసి నివాళులర్పించారు. రెండు నిమిషాలు మౌనం పాటించారు. కార్యక్రమంలో సనకానంద స్వామి, మున్సిపల్ మాజీ చైర్మన్ సుద్దాల చంద్రయ్య, మాజీ సర్పంచ్ కేడం లింగమూర్తి, స్ఫూర్తి అసోసియేషన్ అధ్యక్షుడు పందిల్ల శంకర్, వీరసోమయ్య, నీరుమల్ల లచ్చన్న, శివరాజం తదితరులు పాల్గొన్నారు.

మృతుడి కుటుంబానికి మంత్రి భరోసా

కోహెడరూరల్(హుస్నాబాద్): మండలంలోని రాంచంద్రాపూర్ గ్రామానికి చెందిన జేరిపోతుల రాములు హుస్నాబాద్‌లో జరిగిన రోడ్డు ప్రమాదంలో మృతి చెందాడు. ఈ విషయం తెలుసుకున్న మంత్రి పొన్నం ప్రభాకర్ అమెరికాలో ఉన్నప్పటికీ రూ.10 వేల నగదు స్థానిక నాయకుల ద్వారా మృతుడి భార్య జ్యోతికి అందజేశారు. ఆర్టీసీ అధికారులతో మాట్లాడి వారి కుటుంబానికి న్యాయం జరిగేలా చూస్తామని భరోసా ఇచ్చారు.

బస్టాండ్‌లో ధాన్యం



నిత్యం ప్రయాణికులతో రద్దీగా ఉండాల్సిన బస్టాండ్ వినియోగంలోకి రాకపోవడంతో రైతులు ధాన్యం ఆరబోయడానికి, గ్రామాల్లో జరిగే పంచాయితీలకు, రాత్రి పూట మద్యం తాగేవారికి అడ్డాగా మారింది. ధాన్యాన్ని ఆరబోయడానికి కల్లాలు లేకపోవడం, కొనుగోలు కేంద్రాల వద్ద సరిపడా స్థలం లేని కారణంగా చిన్నకోడూరులో రైతులు బస్టాండ్‌లో ధాన్యం ఆరబోస్తున్నారు. - చిన్నకోడూరు(సిద్దిపేట)

బోనమెత్తిన బందారం



మండలంలోని బందారంలో మహంకాళి, దుర్గమ్మ తల్లి విగ్రహ ప్రతిష్ఠ, బొడ్రాయి ఏర్పాటు చేసి ఏడాదైన సందర్భంగా ఆదివారం అమ్మవారి బోనాల ఉత్సవం నిర్వహించారు. ప్రతీ ఇంటి నుంచి రెండేసి బోనాలను ఊరేగింపుగా తీసుకెళ్లి పోచమ్మ, మహంకాళి అమ్మవార్లకు సమర్పించారు. బోనాల ఊరేగింపుతో వీధులన్నీ పండగ శోభను సంతరించుకుంది. మూడు రోజుల పాటు ఉత్సవాలు నిర్వహించనున్నారు. - కొండపాక(గజ్వేల్)

జీలుగ విత్తనాలు అందించాలి

కోహెడ(హుస్నాబాద్): వర్షాకాలం వరి సాగు కోసం రైతులకు జీలుగ, జనుము విత్తనాలు అందించాలని బీజేపీ మండల అధ్యక్షుడు ఖమ్మం వెంకటేశం ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. ఆదివారం ఆయన మాట్లాడుతూ పంటల సాగుకు ముందు పచ్చిరొట్ట సాగు చేస్తారని, అయితే విడతల వారీగా విత్తనాలు అందించడంపై ఆగ్రహం వ్యక్తం చేశారు. రోహిణీ కార్తెలో జీలుగ, జనుము విత్తనాలు రైతులకు అవసరం ఉంటుందన్నారు. కానీ, సరిపడా విత్తనాలను మండలానికి కేటాయించడంలో అధికారులు నిర్లక్ష్యంగా వ్యవహరిస్తున్నారన్నారు. అధికారులు విత్తనాల కోసం ఇండెంట్ పెట్టడంలో ఎందుకు జాప్యం చేస్తున్నారని ప్రశ్నించారు. ఉన్నతాధికారులు స్పందించి సమస్యను పరిష్కారించాలని కోరారు.

ప్రభుత్వ పాఠశాలలకు.. పూర్వ వైభవం వచ్చేనా?

అయా గ్రామాల్లో ప్రభుత్వ పాఠశాలల భవనాలు ఉన్నా పిల్లల సంఖ్య లేక మూతపడ్డాయి. ఆర్థిక పరిస్థితి బాగున్న కుటుంబాలు తమ పిల్లలను ప్రైవేటు పాఠశాలలకు పంపుతున్నారు. పేదింటి పిల్లలు పొరుగు గ్రామాల్లోని ప్రభుత్వ పాఠశాలలకు వెళ్తున్నారు. వారికి స్వగ్రామంలో ప్రభుత్వ విద్య అందడంలేదు. ఇటీవల రాష్ట్ర ప్రభుత్వం మూతబడిన పాఠశాలలను తెరిపిస్తామని ప్రకటన చేయడంతో తమ గ్రామాల్లోని పాఠశాలలకు పూర్వ వైభవం వస్తుందని గ్రామస్తులు భావిస్తున్నారు.



నిర్మల్‌నగర్‌లో కొత్తగా నిర్మించిన పాఠశాల భవనం

మూతపడిన పాఠశాలలు

- ప్రభుత్వ ప్రకటనతో గ్రామస్తుల్లో ఆశలు
- భవనాలున్నా నిరుపయోగం
- చర్యలు చేపట్టిన విద్యాశాఖ

జగదేవ్‌పూర్(గజ్వేల్): మండలంలోని నిర్మల్‌నగర్, రాంనగర్, అలిరాజ్‌పేట గ్రామాల్లో ప్రభుత్వ ప్రాథమిక పాఠశాలలు ఉన్నాయి. కరోనా సంక్షోభానికి ముందు అవి చాలా తక్కువ మంది విద్యార్థులతో నడిచాయి. కరోనా అనంతరం విద్యార్థుల సంఖ్య తగ్గడంతో అవి మూతపడ్డాయి. నిర్మల్ నగర్ పాఠశాల పాత భవనం శిథిలావస్థకు చేరడంతో రెండేళ్ల క్రితం రూ.10 లక్షలతో నూతన భవనం నిర్మించారు. భవనం ఉన్నప్పటికీ విద్యార్థుల సంఖ్య ఐదు మంది మించి చేరకపోవడంతో మూతపడింది. ఆ గ్రామం నుంచి ఇటిక్యాల ప్రభుత్వ పాఠశాలకు 15 మంది విద్యార్థులు వెళ్లగా పక్కన ఉన్న ప్రైవేటు పాఠశాలకు 40 మంది వరకు వెళ్తున్నారు. అలాగే రాంనగర్ పాఠశాల పరిస్థితి కూడా ఇలాగే ఉంది. విద్యార్థుల సంఖ్య తగ్గడంతో రెండేళ్ల నుంచి పాఠశాలను తెరవలేదు. ఉపాధ్యాయుడు ఒక్కడే ఉండటంతో గ్రామస్తులే విద్యావలంటర్‌ను ఏర్పాటు చేసుకున్నారు. అయినా ఫలితం లేకుండా పోయింది. ఆ గ్రామంలో ప్రాథమిక విద్యనభ్యసించే విద్యార్థులు సుమారుగా 50 మందికి పైగా ఉన్నారు. అందులో పది మంది తిగుల్ పాఠశాలకు వెళ్లగా మిగతా వారంతా జగదేవ్‌పూర్, అలిరాజ్‌పేట ప్రైవేటు పాఠశాలలకు వెళ్తున్నారు. అలిరాజ్‌పేటలో చాలా ఏళ్లుగా ప్రైవేటు పాఠశాలకు ఎయిడెడ్ పాఠశాలగా అవకాశం కల్పించారు. దీంతో గ్రామానికి చెందిన పేదింటి పిల్లలు ఈ పాఠశాలలో చేరారు. మూడేళ్ల క్రితం ఎయిడెడ్ రద్దు చేయడంతో గ్రామంలో ఉన్న విద్యార్థులంతా ప్రైవేటు పాఠశాలకు వెళ్లారు. కరోనా కంటే ముందు సర్పంచ్ లక్ష్మి చొరవతో మహిళా భవనంలో ప్రభుత్వ పాఠశాలను ప్రారంభించారు. ప్రారంభంలో 30 మంది విద్యార్థులు పాఠశాలకు రాగా కరోనా రావడంతో విద్యార్థుల సంఖ్య తగ్గడంతో అది మూతపడింది. గతేడాది గ్రామంలో పాఠశాల భవనం కోసం రూ.45 లక్షలు మంజూరు కావడంతో భవన నిర్మాణం చేపట్టారు. ప్రస్తుతం నిర్మాణం చివరిదశలో ఉంది.



అలిరాజ్‌పేటలో నిర్మించిన పాఠశాల భవనం

పాఠశాలలు ప్రారంభించేలా చర్యలు

మండలంలోని మూడు గ్రామాల్లోనే పాఠశాలలు మూతపడ్డాయి. పలుమార్లు గ్రామస్తులకు అవగాహన కల్పించినా ఫలితం లేకుండాపోయింది. ప్రభుత్వ పాఠశాలలను కాపాడుకునే బాధ్యత విద్యార్థుల తల్లిదండ్రులపై కూడా ఉంది. ఇదే విషయాన్ని ఉన్నతాధికారుల దృష్టికి తీసుకపోయాం. మూడు గ్రామాల్లో పాఠశాలలను ప్రారంభించేలా చర్యలు తీసుకుంటాం.
– ఉదయ్‌భాస్కర్‌రెడ్డి, ఎంఈఓ, జగదేవ్‌పూర్

పోలింగ్ కేంద్రాలకు సిబ్బంది



కొమురవెల్లిలో బ్యాలెట్ బాక్సులను పోలింగ్ కేంద్రానికి తెచ్చిన సిబ్బంది



మద్దూరు చేరుకున్న పోలింగ్ సిబ్బంది

కొమురవెల్లి(సిద్దిపేట): ఉమ్మడి ఖమ్మం, వరంగల్, నల్గొండ జిల్లాల పట్టభద్రుల ఎమ్మెల్సీ ఉప ఎన్నిక సోమవారం జరుగనుంది. ఎన్నికల సామగ్రిని పోలింగ్ అధికారులు ఆదివారం మండల కేంద్రంలోని పోలింగ్ కేంద్రానికి తరలించారు. సోమవారం ఉదయం 8 నుంచి సాయత్రం 4 గంటల వరకు పోలింగ్ జరగనుంది. మండలంలోని 447 మంది పురుషులు, 231 మంది మహిళలు తమ ఓటుహక్కును వినియోగించుకోనున్నారు. పోలీసులు గట్టి బందోబస్తు ఏర్పాటు చేశారు.

ఎన్నికల సామగ్రితో..

మద్దూరు(హుస్నాబాద్): ఉమ్మడి ఖమ్మం, వరంగల్, నల్గొండ జిల్లాల పట్టభద్రుల ఎమ్మెల్సీ ఎన్నిక సోమవారం జరగనుంది. మద్దూరు, దూళ్మిట్ట మండల కేంద్రాలకు ఆదివారం ఎన్నికల సామగ్రితో సిబ్బంది చేరుకున్నారు. ఉదయం 8 గంటల నుంచి సాయంత్రం 4 గంటల వరకు ఎన్నికలు కొనసాగనున్నాయి. ఎన్నికల నిర్వహణ అధికారులు చర్యలు తీసుకున్నారు.

పోలింగ్ కేంద్రాలకు..

చేర్యాల(సిద్దిపేట): ఉమ్మడి ఖమ్మం, వరంగల్, నల్గొండ జిల్లాల పట్టభద్రుల ఎమ్మెల్సీకి సోమవారం జరగనున్న ఉప ఎన్నిక సామగ్రిని అధికారులు ఆయా కేంద్రాలకు తరలిస్తున్నారు. ఆదివారం కలెక్టర్ కార్యాలయం నుంచి ప్రత్యేక బస్సులో పట్టణ కేంద్రంలోని పెద్దమ్మగడ్డ పాఠశాల పోలింగ్ కేంద్రానికి ఎన్నికల సామగ్రి చేరుకుంది. జనగామ అసెంబ్లీ నియోజకవర్గ పరిధిలోని చేర్యాల పట్టణ కేంద్రంతో పాటు మండల పరిధిలో ఉన్న 2,555 మంది పట్టభద్రులు తమ ఓటుహక్కును వినియోగించుకోనున్నారు. అధికారులు ఏర్పాట్లు చేశారు. చేర్యాలలోని రెండు పోలింగ్ కేంద్రాలకు సెక్టోరియల్, జోనల్ అధికారిగా ఇన్‌చార్జి ఎంపీడీఓ మహబూబ్ అలీ వ్యవహరించనున్నారు. ఒక కేంద్రానికి పీఓ, ఏపీఓ, ఇద్దరు సిబ్బంది, మైక్రో అబ్జర్వర్ విధులు నిర్వహిస్తారని సెక్టోరియల్ అధికారి తెలిపారు. రెండు పోలింగ్ కేంద్రాల పరిధిలో 1686 మంది పురుషులు, 869 మహిళలు తమ ఓటుహక్కు వినియోగించుకోనున్నారు.

అధైర్యపడొద్దు.. అండగా ఉంటాం

కాంగ్రెస్ పార్టీ నియోజకవర్గ ఇన్‌చార్జి హరికృష్ణ

సిద్దిపేటరూరల్: శనివారం రాత్రి కురిసిన వర్షాలకు ఇబ్బంది పడుతున్న ప్రజలు, రైతులు అధైర్యపడొద్దని, బాధితులకు అండగా ఉంటామని కాంగ్రెస్ పార్టీ సిద్దిపేట నియోజకవర్గ ఇన్‌చార్జి పూజల హరికృష్ణ అన్నారు. ఆదివారం సిద్దిపేట రూరల్, నారాయణరావుపేట మండలాల్లో పర్యటించి వర్ష బాధితులను పరామర్శించారు. నష్టం వివరాలు తెలుసుకుని అండగా ఉంటామని భరోసానిచ్చారు.



వర్ష బాధితులతో మాట్లాడుతున్న పూజల హరికృష్ణ

బెల్లి లలిత విగ్రహం ఏర్పాటుకు డిమాండ్



బెల్లి లలిత చిత్ర పటానికి నివాళులర్పిస్తున్న నాయకులు

హుస్నాబాద్‌రూరల్: తెలంగాణ మలిదశ ఉద్యమంలో కీలక పాత్ర పోషించి తన పాటలతో ప్రజలను చైతన్య పరిచిన బెల్లి లలిత విగ్రహాన్ని ట్యాంక్‌బండ్‌పై ఏర్పాటు చేయాలని జేఏసీ నాయకుడు మేకల వీరన్నయాదవ్ డిమాండ్ చేశారు. ఆదివారం మీర్జాపూర్ గ్రామంలో యాదవుల ప్రతినిధుల ఆధ్వర్యంలో బెల్లి లలిత 25వ వర్ధంతి నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళర్పించారు. అనంతరం వీరన్న యాదవ్ మాట్లాడుతూ మిల్లుల్లో పని చేస్తూ కార్మిక సంఘాలను ఏర్పాటు చేసి మహిళలను చైతన్యవంతులయ్యే విధంగా పాటలు పాడి పాలకుల కంటికి కునుకు లేకుండా చేసిందన్నారు. డోలుదెబ్బ సంఘం ఏర్పాటు చేసి గొల్ల కురుమలను చైతన్యపరిచిందన్నారు. తెలంగాణ జనసభ ఆధ్వర్యంలో తెలంగాణ కళాసమితి ఏర్పాటు చేసి అనేక ఉద్యమాలను నిర్వహించిందన్నారు. ఆమె స్ఫూర్తితో హక్కుల కోసం ఉద్యమించాలన్నారు. కార్యక్రమంలో జేఏసీ నాయకుడు ఇల్లెందుల లక్ష్మణ్, వీరన్న పాల్గొన్నారు.

నేడు విద్యుత్ సరఫరా బంద్

ములుగు(గజ్వేల్): మండలంలోని తున్కిబొల్లారం 132/33 కేవీ సబ్‌స్టేషన్‌లో మరమ్మతుల కారణంగా సబ్‌స్టేషన్ పరిధిలో సోమవారం ఉదయం 9 నుంచి 11 గంటల వరకు విద్యుత్ సరఫరా నిలిపివేస్తున్నట్లు ఏఈ శ్రీనివాస్ తెలిపారు. ములుగు సబ్‌స్టేషన్, వంటిమామిడి, క్షీరసాగర్, తున్కిబొల్లారం, కొక్కొండ, బండమైలారం, బండమైలారం, బండతిమ్మాపూర్, తున్కిబొల్లారం సీడ్ పార్కుల పరిధిలోని పరిశ్రమలకు విద్యుత్ సరఫరా ఉండదన్నారు.

కార్యకర్తలకు బీఆర్‌ఎస్ అండ

మిరుదొడ్డి(దుబ్బాక): కార్యకర్తలకు బీఆర్‌ఎస్ పార్టీ అండగా ఉంటుందని ఆ పార్టీ మండల అధ్యక్షుడు తోట అంజిరెడ్డి అన్నారు. మండల కేంద్రమైన మిరుదొడ్డిలో కార్యకర్త చిన్న ఎల్లయ్య భార్య రాజవ్వ ఇటీవల అనారోగ్యంతో మృతి చెందింది. మృతురాలి కుటుంబాన్ని ఆదివారం స్థానిక నాయకులతో కలిసి పరామర్శించారు. కార్యక్రమంలో మాజీ ఎంపీటీసీ ధార స్వామి, పార్టీ టౌన్ ప్రెసిడెంట్ ధర్మారం పెద్దబాబు పాల్గొన్నారు.

పీహెచ్‌సీ ప్రాంగణంలో తేనెతెట్టె

మిరుదొడ్డి(దుబ్బాక): రోగాలను నయం చేయించుకోడానికి మిరుదొడ్డి పీహెచ్‌సీ కేంద్రంలో అడుగు పెట్టిన వారు అవాక్కవుతున్నారు. పీహెచ్‌సీ ప్రాంగణంలోని ఓ చెట్టుపై పెట్టిన కందిరీగలు పెట్టిన తేనెతెట్టె ప్రమాద ఘంటికలు మోగిస్తోంది. దీంతో చికిత్స చేయించుకోవడానికి రావాలంటే వెన్నులో వణుకు పుడుతోందని రోగులు భయాందోళన వ్యక్తం చేస్తున్నారు. కందిరీగలు ఎప్పుడు దాడి చేస్తాయోనని భయపడుతున్నారు. సంబంధిత అధికారులు వెంటనే స్పందించి కందిరీగ తెట్టెను తక్షణమే తొలగించాలని కోరుతున్నారు.



పీహెచ్‌సీ ప్రాంగణంలో చెట్టుకు తేనెతెట్టె

బీసీ డిక్లరేషన్‌కు కట్టుబడి ఉండాలి

సిద్దిపేటకమాన్: బీసీ డిక్లరేషన్‌కు రాష్ట్ర ప్రభుత్వం కట్టుబడి ఉండాలని బీసీ జనసభ రాష్ట్ర అధ్యక్షుడు రాజారాం అన్నారు. సిద్దిపేట ప్రెస్‌క్లబ్‌లో ఆదివారం నిర్వహించిన సమావేశంలో ఆయన మాట్లాడారు. అసెంబ్లీ ఎన్నికల్లో లబ్ధిపొందిన కాంగ్రెస్ మరోసారి బీసీలను మోసం చేసేందుకు కులగణనను సిద్ధం చేసిందన్నారు. స్థానిక సంస్థల ఎన్నికల్లో బీసీలకు 42 శాతం రిజర్వేషన్ కల్పించాలని జూన్ 8వ తేదీన ఇందిరపార్క్ వద్ద మహాధర్నా, జూన్ 15న బీసీ కుల సంఘాలతో సెక్రటేరియట్‌ను ముట్టడిస్తామన్నారు. కార్యక్రమంలో బీసీ కుల సంఘాల నాయకులు కృష్ణ, సంతోష్, రాములు తదితరులు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న బీసీ జనసభ నాయకులు

అ'పూర్వ' సమ్మేళనం

వారంతా చిన్ననాటి స్నేహితులు, కలిసి చదువుకున్నారు. పదో తరగతి పూర్తిచేసిన తర్వాత కొందరు ఉద్యోగాల్లో స్థిరపడగా, మరికొంత మంది వ్యాపారం, ఇతర రంగాల్లో కొనసాగుతున్నారు. దశాబ్దాల తర్వాత మళ్లీ పూర్వ విద్యార్థుల ఆత్మీయ సమ్మేళనంలో కలుసుకున్నారు. చిన్ననాటి స్నేహితులను కలుసుకోవడంతో కేరింతలు కొట్టారు. పరస్పరం యోగక్షేమాలు తెలుసుకున్నారు. చిన్ననాటి సంగతులు గుర్తుచేసుకున్నారు. తమకు విద్యాబుద్ధులు చెప్పిన గురువులను కార్యక్రమానికి ఆహ్వానించారు. ఆటపాటలతో సందడి చేశారు. గురువులను ఘనంగా సన్మానించి జ్ఞాపికలను అందజేశారు. పాఠశాలలో మొక్కలు నాటారు.



హుస్నాబాద్:1993-94 బ్యాచ్ పదో తరగతి విద్యార్థులు



దుబ్బాకరూరల్: 1998-99 బ్యాచ్ టెన్త్ విద్యార్థులు



కొండపాక(గజ్వేల్): కుకునూరుపల్లి హైస్కూల్‌లో 1999-2000 బ్యాచ్ పదో తరగతి విద్యార్థులు



అక్కన్నపేట (హుస్నాబాద్): గోవర్ధనగిరిలో 2009-10 బ్యాచ్ టెన్త్ విద్యార్థులు